నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | HYDERABAD

'ఇచ్చట చెత్త వేయరాదు'.. అని బోర్డు ఏర్పాటు చేసిన చోటే పేరుకుపోయిన వ్యర్థాలు.. చిలుకానగర్ రోడ్డులో కనిపించిన దృశ్యమిది

ఆదివారం జనంతో కిటకిటలాడుతున్న ముషీరాబాద్ చేపల మార్కెట్

బల్దియాలో అధికార్ల వైభోగం ..!

ఔటర్ దాటి.. తిరుగుతున్న జీహెచ్ఎంసీ వాహనాలు

సొంత అవసరాలకు వినియోగిస్తున్న కొందరు అధికారులు
ట్రాఫిక్ చలాన్లులే ఇందుకు నిదర్శనం
తిరగని కిలోమీటర్లకు 'డీజిల్' డ్రా
డీజిల్ కూపన్ల జారీలో కొరవడిన నియంత్రణ
ఖజానాకు భారీగా గండి పడుతున్నా.. పట్టని యంత్రాంగం

సిటీబ్యూరో: పౌరుల సేవలకు కేటాయించిన ప్రభుత్వ వాహనాలను కొంత మంది అధికారులు తమ కుటుంబ సేవలకు వినియోగిస్తున్నారా? విధి నిర్వహణలో మాత్రమే వినియోగించాల్సిన వాహనాలను గ్రేటర్‌ను దాటించి ఇతర జిల్లాల్లోకి తమ సొంత అవసరాలకు వాడుతున్నారా? అంటే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులపై కార్లపైన ఇటీవల వస్తున్న ట్రాఫిక్ చలాన్లు అవుననే సమాధానం ఇస్తున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండాల్సిన వాహనాలు ఔటర్ దాటి ఇతర జిల్లాల్లో సైతం దర్శనమిస్తున్నాయి. సెలవు రోజుల్లోనే కాదు పని దినాల్లోనూ బయటి జిల్లాల్లో ఈ కార్లకు ఓవర్ స్పీడింగ్, రాంగ్ పార్కింగ్, సిగ్నల్స్ జంపింగ్ వంటి చలాన్లు వస్తున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే ఇష్టారీతిలో వాహనాల వినియోగం, లెక్కకు మించి డీజిల్ వినియోగం చేస్తూ బల్దయా ఖజానాకు భారీగా గండి పడుతున్నది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో డ్రైవర్ కం ఓనర్ పథకం కింద ఉన్న వాహనాలతో పాటు ప్రైవేట్ కార్లు దాదాపు 750 వరకు ఉన్నాయి. వీటికోసం బల్దియా ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. ముఖ్యంగా కొందరు అధికారుల తీరుతో ఖజానాకు నష్టం జరుగుతున్నది. అధికారిక కార్యక్రమాలు నిర్వహించడానికి..తనిఖీలకు, పరిశీలనకు సమకూర్చిన ప్రభుత్వ వాహనాలను సినిమాలు , షికార్లు, షాపింగ్‌లకు, కుటుంబ పర్యటనలకు, బంధువుల ఇంట కార్యాలకు, ఆఖరుకు కూరగాయలు తీసుకురావడం, ఇలా చిన్నా చితక పనులకు సైతం ఇవే వాహనాలను వినియోగిస్తుండటంతో ప్రజాధనం నీళ్ల ప్రాయంగా ఖర్చు అవుతున్నది.

ఎన్నికల కోడ్‌లోనూ దుబారా?

జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ , కమిషనర్ వంటి వారికి సైతం ప్రతి నెల అప్పర్ లిమిట్ 1000 లీటర్ల డీజిల్ వాడుకునే అవకాశం ఉంది. అయితే మేయర్, డిప్యూటీ మేయర్ ఎక్కడికి తిరగకపోయినా ఫుల్ డీజిల్ కూపన్లు ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న రోజుల్లో సైతం ఈ ప్రజాప్రతినిధులు 800 నుంచి 900 లీటర్ల డీజిల్ యూజ్ చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. కమిషనర్ జోక్యం చేసుకొని ఇంధనం పేరిట జరుగుతున్న దుబారాను అడ్డుకట్ట వేసి...పాత బిల్లులపై సమగ్ర విచారణ జరిపించాలన్న డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి.

అడ్డూ అదుపులేదు..

కార్పొరేషన్ కార్యక్రమాలు..తనిఖీలకు, పరిశీలనకు మాత్రమే సర్కారు వాహనాలను వినియోగించాలి. జీహెచ్ఎంసీలో కొందరు అధికారులు మాత్రం ఈ వాహనాలను విచ్చల విడిగా వినియోగిస్తున్నారు. కొందరైతే సొంత వ్యవహారాలకు కూడా సర్కారు వాహన సేవలు ఉపయోగించుకుంటున్నారు. ఓ అధికారి తమ పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి, తిరిగి తీసుకొచ్చేందుకు..మరొకరు సినిమాలు, షికార్లు, షాపింగ్‌లకు, కుటుంబ పర్యటనలకు, బంధువుల ఇంటి శుభకార్యాలకు, ఆఖరికి కూరగాయలు తీసుకురావడానికి సైతం ప్రభుత్వ వాహనాలను వినియోగిస్తున్న అధికారులు లేకపోలేదు.

100 కిలోమీటర్లు..

జీహెచ్ఎంసీలో ఉన్నతాధికారులకు ఇన్నోవా కార్లు... డిప్యూటీ కమిషనర్లకు స్కార్పియో కార్లు, మెడికల్ ఆఫీసర్లు, జాయింట్ కమిషనర్లకు బొలెరో కార్లు ఉన్నాయి. వీటికి ఆయా విభాగాల అధికారులను బట్టి 200 నుంచి 280 లీటర్ల డీజిల్ ప్రతి నెల సమకూరుస్తారు. ఇందులో చాలా మంది ఇంటికి ఆఫీసుకు మాత్రమే కార్లను ఉపయోగిస్తున్నారు. అందుకు ప్రతి రోజు 30 నుంచి 50 కిలోమీటర్లు లోపు మాత్రమే తిరుగుతారు. కానీ 100 కిలోమీటర్ల దూరం తిరిగినట్లుగా డీజిల్ డ్రా చేసుకుంటున్నారు. అయితే తిరిగి కిలోమీటర్లను బట్టి కాకుండా ప్రతి నెల వీరికి 280 లీటర్ల డీజిల్ ఇస్తుండడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతున్నది.

అటు పెనాల్టీలు..ఇటు సీజ్

వ్యాపారస్తులపై కొరడా
ఝుళిపిస్తున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులను జీహెచ్ఎంసీ టార్గెట్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి సంబంధిత వ్యాపార సంస్థలను సీజ్ చేస్తున్నది. అంతేకాకుండా ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకుంటున్న వారిపై 25 శాతం అదనపు రుసుమును వసూలు చేస్తూ ఖజానాను నింపుకుంటున్నది. వాస్తవంగా గ్రేటర్‌లో వ్యాపార సంస్థలకు జీహెచ్ఎంసీ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన జనవరి 31తో ఉచితంగా రెన్యూవల్ చేసే గడువు ముగిసింది. ఈ నెల 1 నుంచి రెన్యూవల్ చేసుకోనున్న ట్రేడ్ లైసెన్స్‌లపై ఫీజులో 25 శాతాన్ని పెనాల్టీ వేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే నెల 1 నుంచి నెలాఖరు వరకు 50 శాతం జరిమానాగా వసూలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి రెన్యూవల్ చేసుకునే వ్యాపారుల నుంచి చెల్లించాల్సిన ట్రేడ్ ఫీజులో వంద శాతం జరిమానా వసూలు చేయనున్నారు. కాగా మెడికల్ ఆఫీసర్, లైసెన్సింగ్ ఆఫీసర్ ప్రతి రోజు కనీసం 20 వ్యాపార సంస్థలను నేరుగా కలిసి వ్యాపారస్తుల నుంచి ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం (ఈ నెల 23వ తేదీ) నాటికి 78 వేల మంది వ్యాపారస్తుల నుంచి బల్దియా రూ. 76 కోట్ల మేర ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో ఆదాయాన్ని సమకూర్చుకున్నది. ఇంకా 32 వేల మంది వ్యాపారస్తులపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికల్లా రూ. 120కోట్ల వరకు ట్రేడ్ లైసెన్స్ ఆదాయం రాబడతామని అధికారులు తెలిపారు.

8 మంది ఐపీఎస్‌ల బదిలీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ):ఎనిమిది మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ ఏడీసీగా శ్రీకాంత్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా జోయల్ డేవిస్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా గజారావు భూపాల్, హైదరాబాద్ క్రైమ్స్ అదనపు కమిషనర్‌గా విశ్వప్రసాద్, సీఐడీ ఎస్పీగా నవీన్‌కుమార్, సీఐడీ ఏడీసీగా రామ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీగా శ్రీధర్, హైదరాబాద్ ఎస్టీ డీసీసీగా చైతన్యకుమార్‌లను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తులు సరే.. కార్డుల మంజూరెప్పుడు?

రేషన్‌కార్డుల జారీపై
ప్రభుత్వానికి స్పష్టత కరవు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులిస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ దరఖాస్తులతో కాలయాపన చేస్తున్నది. ఏడాది నుంచి ఇప్పటి దాకా అర్హులు నాలుగు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, గ్రామ–వార్డు సభలు, ప్రజావాణి, మీసేవలో అనేక సార్లు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీపై ప్రకటనలకే పరిమితమైంది. ఎవరికి ఇస్తారు? ఏ ప్రాతిపదికన ఇస్తారో సరైన మార్గదర్శకాలు జారీ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీహెచ్ఎంసీ సిబ్బంది, పౌర సరఫరాల శాఖ అధికారులు లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. కానీ.. ఏ ప్రాతిపదికన రేషన్ కార్డులిస్తారు? అర్హులు ఎవరు? అర్హతగా దేన్ని ఆధారంగా చేసుకుంటారని అడిగితే తమకు తెలియదని, సర్వే చేయడం వరకే తమ బాధ్యతని చెబుతున్నట్లు అర్జీదారులు అంటున్నారు. తమకు రేషన్ కార్డు వస్తుందా? లేదా? అనే అయోమయంలో ఉన్నామనవి వాపోతున్నారు.

సరైన మార్గదర్శకాలేవి?

రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పడం, దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించడం తప్ప.. సరైన మార్గదర్శకాలు మాత్రం జారీ చేయలేదు. అర్హులకు ఏ ప్రాతిపదికన కార్డు ఇస్తారో అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులుకు స్పష్టత లేకుండా పోయింది. మరికొద్ది రోజుల్లో రేషన్ కార్డులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. సీఎం ఒక అడుగు ముందుకేసి.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే రేషన్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ ఎవరికి ఇవ్వాలి.. ఎలా ఇవ్వాలో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గందరగోళంలో దరఖాస్తుదారులు

రేషన్ కార్డు వస్తుందో లేదోననే అయోమయంలో దరఖాస్తుదారులున్నారు. ఏడాదిలోనే నాలుగుసార్లు దరఖాస్తు చేసుకోమనడంతో ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారు. దరఖాస్తు చేసుకోమంటున్నారు కానీ ఇస్తరో ఇవ్వరో అనే నిరాశలో ఉన్నట్లు తెలుస్తున్నది. తమ రేషన్ కార్డు స్టేటస్ ఏంటని తెలుసుకునేందుకు నిత్యం మీసేవలో వాకబు చేస్తున్నారు. సర్వేకొచ్చిన అధికారులను అడిగితే తమకు తెలియదనడంతో ఎవరిని అడగాలో తెలియని గందరగోళంలో ఉన్నారు. అన్ని అర్హతలున్నా రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేకపోతున్నామని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అనుమానాలను తొలగించి త్వరితగతిన రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అప్లికేషన్‌లో అన్నీ సమస్యలే..

గతంలో అప్లికేషన్ చేసుకున్నవారు మరోసారి మీసేవలో దరఖాస్తు చేసుకుంటే వివిధ సమస్యలు వెలుగు చూస్తున్నట్లు అర్హులు చెబుతున్నారు. ఎక్కువ దరఖాస్తుల్లో పెండింగ్, అలాటెడ్, అప్రూవ్డ్, అని చూపుతున్నట్లు మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు. వారందరికీ కొత్త కార్డులు వస్తాయో రావోననే అమోమయంలో ఉన్నట్లు దరఖాస్తుదారులు చెబుతున్నారు. మీసేవ సైట్‌లో ఏ స్టేటస్‌లో ఉంటే రేషన్‌కార్డు వస్తుందో ప్రభుత్వం తెలపాలని కోరుతున్నారు. 'పెండింగ్' అని వచ్చిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలో లేదో చెప్పాలని అంటున్నారు. ప్రభుత్వం స్పష్టత ఇచ్చేదాకా ప్రజల్లో గందరగోళం తొలగే పరిస్థితి లేదు. సమస్యలన్నింటినీ తొలగించి తమ ఇబ్బందులకు స్వస్తి పలకాలని కోరుతున్నారు.

ఫ్యూచర్ సిటీకి గ్రీన్ కారిడార్

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి రావిర్యాల మీదుగా మెట్రో మార్గం
క్షేత్రస్థాయిలో పర్యటించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి


ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు మెట్రో నమూనా

సిటీబ్యూరో: ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి గ్రీన్ కారిడార్ మెట్రోను నిర్మించనున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో పరుగులు పెట్టేలా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైలు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హెచ్ఎండీఏ, టీజీఐఐసీతో కలిసి నిర్మించేలా ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా, ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్ లను అభివృద్ధి చేయనున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా కసరత్తు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గ్రీన్ కారిడార్‌ను నిర్మించనున్నట్లుగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్ట్ నుంచి మీర్ ఖాన్ పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీ కోసం జరుగుతున్న సర్వే పనుల నేపథ్యంలో... కొంగరకలాన్ దాటి మెట్రో అధికారులతో కలిసి ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు.

40 కిలోమీటర్లు ఉండేలా..

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్లు ఉండేలా నిర్మిస్తున్నారు. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుంచి మొదలై మెట్రో రైల్ డిపో మీదుగా, ఎయిర్ పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్ పల్లి రోడ్డు గుండా పెద్ద గొల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కి చేరనుంది. బహదూర్ గూడలో ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్ గూడ, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవునా.. ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్‌లో మెట్రో రైలుకి కేటాయించిన ప్రాంతంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామన్నారు. అక్కడి నుంచి సిల్క్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్ ఖాన్ పేట్ వరకు 328 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 72 అడుగుల వెడల్పుతో ఉండే ప్రాంతంలో భూ ఉపరితల మెట్రో రైలును అభివృద్ధి చేయనున్నారు. విశాలమైన రోడ్డు మధ్యలో రోడ్డుకు సమానంగా మెట్రోకు ఇరువైపులా మూడు లైన్ల విశాలమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. రూ. 22 వేల కోట్లతో మెట్రో మొదటి దశను 69 కి.మీ మేర నిర్మించినట్లుగానే, హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లుగా తెలిపారు.

24 స్టేషన్లు..36.8 కి.మీలు

ఫేస్–2లో అత్యంత రద్దీ కలిగిన మార్గంగా నాగోల్ శంషాబాద్ లైన్ క్లియరైంది. నాగోల్ నుంచి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేసే ఈ మార్గం పొడవు మొత్తం 36.8 కిలోమీటర్లు కాగా దీని ద్వారా నిత్యం 3.70లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉందని అంచనా. ఫేస్–2లో కారిడార్–4ను దాదాపు రూ. 11,226 అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. 36.8 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రతిపాదిత మెట్రో స్టేషన్ల నిర్మాణంపై కొన్ని మార్పులకు అవకాశం ఉందని తెలిసింది. ఇందులో నాగోల్, నాగోల్ చౌరస్తా, అల్కాపురి, కామినేని హాస్పిటల్, ఎల్బీ నగర్, బైరామల్‌గూడ, మైత్రీ నగర్, కర్మన్ ఘాట్, చంపాపేట్, ఓవైసీ హాస్పిటల్, డీఆర్డీవో, బాలాపూర్ రోడ్డు, చాంద్రాయణ్‌గుట్ట, బండ్లగూడ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూ హైకోర్టు, గగన్ పహాడ్, శాతంరాయి, సిద్దాంతీ, శంషాబాద్, ఎయిర్‌పోర్టు కార్గో, ఎయిర్‌పోర్టు ప్రాంగణం వరకు ఈ మార్గాన్ని నిర్మించనున్నారు. ప్రాథమిక దశలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా నిర్మిస్తున్నారు.

చీర కట్టి..పరుగు పెట్టి...

ఖైరతాబాద్: భారత్‌లో మహిళలు ధరించే చీరల ఔనత్యాన్ని చాటుతూ మహిళామణులు చీరకట్టి పరుగులు పెట్టారు. ఆదివారం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా తనైరా..జేజే యాక్టివ్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ శారీ రన్ విశేషంగా ఆకట్టుకున్నది. సుమారు 3వేల మంది మహిళలు సంప్రదాయ చేనేత చీరలను ధరించి రన్‌లో పాల్గొన్నారు. చీరలు కట్టి గృహిణులు గానే కాదు.... ఫిట్‌నెస్‌లోనూ తాము ఎల్లప్పుడూ ముందుంటామని చాటారు. 2020లో ప్రారంభించిన శారీ రన్ బెంగళూరు, కోల్‌కతా, పుణెలో నిర్వహించామని, రెండో ఎడిషన్ నగరంలో ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ సామాజిక సేవకురాలు, గుర్తింపు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వసుంధర కొప్పులతో పాటు సీనియర్ వైద్యురాలు డాక్టర్ జయంతి వంటి ఎందరో ప్రముఖులు ఈ రన్‌లో పాల్గొని స్ఫూర్తిని చాటారు. పురుషులతో సమానంగా మేము సైతమంటూ బుల్లెట్ బండి ఎక్కి చక్కర్లు కొడుతూ..సందడి చేశారు.

సైబర్ దొంగలున్నారు..తస్మాత్ జాగ్రత్త

బంజారాహిల్స్: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం ఫిలిం చాంబర్ నుంచి కేబీఆర్ పార్కు దాకా 'సైబర్ దొంగలున్నారు.. తస్మాత్ జాగ్రత్త' పేరుతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. త్వరలో విడుదల కానున్న 'తకిట తదిమి తందాన' చిత్ర యూనిట్, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని సినీ నిర్మాత బెక్కం వేణుగోపాల్, దర్శకుడు చంద్రమహేశ్, హీరో రాంకీతో పాటు ఫెటాప్సీ చైర్మన్ హరిగోవింద ప్రసాద్ ప్రారంభించారు. ర్యాలీలో భాగంగా సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఫిలిం చాంబర్, అపోలో చౌరస్తా, జగన్నాథ స్వామి ఆలయం, కేబీఆర్ పార్కు మీదుగా సైకిల్ ర్యాలీ కొనసాగింది.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న సినీ నిర్మాతలు, దర్శకులు వేణుగోపాల్,చంద్రమహేశ్